www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 2 సంచిక -313 మంగళవారం 28 జనవరి 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## గద్దర్‌కు అవార్డు ఎట్లిస్తం?



**వందల మంది కార్యకర్తలను నక్సల్స్‌తో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్**

**కేంద్ర పథకాల పేర్లు మార్చితేసహించేది లేదు**

**రాష్ట్రాలప్రమేయం లేకుండా నేరుగా**


**కేంద్రమే ప్రజలకు అందిస్తుంది :**

**కేంద్రమంత్రి బండి సంజయ్**

హైదరాబాద్:జనవరి 27ప్రజావినికిడి:
పద్మ అవార్డుల జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. వందల మంది బీజేపీ కార్యకరలను నమ్మి న సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేస్తే నక్సలైట్ల తో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అని తెలిపారు. అటువంటి గ ద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డులిస్తామని తెగేసి చెప్పారు. బీజేపీ రాష్ట్ర కా ర్యాలయంలో బండి సంజయ్ సోమవారం మీడియాతో మాట్లాడు తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదని, పేర్లు **మిగతాది** **2లో...**

## రాజ్యాంగాన్ని పరిరక్షిస్తాం





**రాజ్యాంగ పరిరక్షణకు తామంతా పోరాడుతున్నాం**

**రాహుల్ వెన్నంటి నడుస్తున్నాం**

**ఇండోర్ ర్యాలీలో సిఎం రేవంత్ రెడ్డి**

ఇండోర్,జనవరి 27ప్రజావినికిడి:
రాజ్యాంగ పరిరక్షణకు తామంతా రాహుల్ గాంధీ వెన్నంటి పోరాడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇది ఎన్నికల ర్యాలీ కాదని, ఒక యుద్ధమని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ పోరాటం చేస్తున్నామని చెప్పారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇండోర్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఈ పరిణామాన్ని గ్రహించే పోరాడుతున్నారని చెప్పారు. గజనీ మహమ్మద్ హిందుస్థాన్‌ను దోచుకునేందుకు యత్నించినట్టు మోదీ రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.**మిగతాది** **2లో...**

## అమెజాన్... ఇలాగైతే ఎలా...?

**అమెజాన్ లో గిఫ్ట్ కార్డుల**

**అంశంపై స్పందించిన పవన్**

**కాలపరిమితి ముగిసిన గిఫ్ట్ కార్డుల నుంచి డబ్బు రికవరీ చేయడం కష్టమని వివరణ**



2లో.

## గుల్లెయిన్ బారే సిండ్రోమ్‌తో తొలిమరణం

101కు చేరిన పుణేలో జీబీఎస్ సోకిన వారి సంఖ్య

16 మంది రోగుల పరిస్థితి విషమం



2లో.

## ప్రపంచాభివృద్ధిలో భారతదేశ యువత కీలక భూమిక

వీరి భాగస్వామ్యం లేకుండా అభివృద్ధిని ఊహించలేం

ఎన్‌సిసి ర్యాలీలో ప్రధాని మోడీ ఉద్ఘాటన



2లో.

## వక్ఫ్ (సవరణ) బిల్లు కు (జెపిసి) ఆమోదముద్ర



న్యూఢిల్లీ జనవరి 27ప్రజావినికిడి::
వక్ఫ్ (సవరణ) బిల్లు పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) అధికార బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ సభ్యులు ప్రతిపాదించిన అన్ని సవరణలను సోమవారం ఆమోదించింది. ప్రతిపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన ప్రతి ఒక్క సవరణను కమిటీ తిరస్కరించింది. క్లాజుల వారీగా వోటింగ్ జరిగింది. సమావేశం అనంతరం కమిటీ చైర్మన్ జగదంబికా పాల్ విలేకరులతో మాట్లాడుతూ, కమిటీ ఆమోదించిన సవరణలు చట్టాన్ని మరింత మెరుగుపరుస్తుందని, మరింత సమర్థమైనదిగా చేస్తుందని చెప్పారు. అయితే, ప్రతిపక్ష ఎంపిలు సమావేశం సాగిన తీరును ఆక్షేపించారు. జగదంబికా పాల్ ప్రజాస్వామిక ప్రక్రియను 'వక్రీకరించారు' అని వారు ఆరోపించారు.'ఇది ప్రహసనప్రాయం. మా అభిప్రాయాలు వినలేదు. పాల్ నియంతలా వ్యవహరించారు' అని తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) కల్యాణ్ బెనర్జీ విలేకరులతో చెప్పారు. అయితే, ఆ ఆరోపణను పాల్ తిరస్కరించారు. మొత్తం ప్రక్రియ ప్రజాస్వామ్యబద్ధంగా సాగింది. మెజారిటీ అభిప్రాయాలు నెగ్గాయి' అని పాల్ తెలిపారు. కమిటీ ప్రతిపాదించిన అత్యంత గణనీయమైన సవరణల్లో ఒకటి ఏమిటంటే%డ% ప్రస్తుత వక్ఫ్ ఆస్తులను 'వినియోగదారు ద్వారా వక్ఫ్' కారణాలపై ప్రశ్నించజాలరు. అది ప్రస్తుత చట్టంలో ఉన్నది. ఆ ఆస్తులను మతపరమైన అవసరాలకు వినియోగిస్తున్న పక్షంలో దానిని కొత్త వెర్షన్‌లో తొలగిస్తారు. కొన్ని సవరణలు కొన్ని పాత్రల కోసం జిల్లా మేజిస్ట్రేట్‌లతో పాటు రాష్ట్ర ప్రభుత్వ అధికారులను నియమించడాన్ని, **మిగతాది** **2లో...**

## పెట్టుబడులపై ప్రగల్భాలే

నిరుడు చెప్పిన రూ. 42వేల కోట్లలో నేటికి ఒక్కటీ రాలేదు

దావోస్ పెట్టుబడులు ఎప్పుడు వస్తాయో..ఎన్ని ఉద్యోగాలు ఇస్తారో సిఎం చెప్పాలి

: బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

2లో.





## ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ మంజూరు



2లో.

## సూర్యాపేటలో మరో పరువు హత్య?





2లో.

# అమెజాన్... ఇలాగైతే ఎలా...?

అమరావతిజనవరి 27ప్రజావినికిడి:
ప్రముఖ ఈ-కామర్స్ పోర్టల్ అమెజాన్ లో గిఫ్ట్ కార్డుల అంశంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అమెజాన్ గిఫ్ట్ కార్డుల్లో డబ్బు జమ చేయడం చాలా సులభమైన ప్రక్రియ అని, జమ చేసేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు మీ క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలు కానీ, లేదా యూపీఐ సమాచారం కానీ ఎంటర్ చేస్తే సరిపోతుందని పేర్కొన్నారు. కానీ, కాలపరిమితి ముగిసిపోయిన గిఫ్ట్ కార్డ్ నుంచి డబ్బులు వెనక్కి తీసుకోవడమే అసలు సమస్య అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. గిఫ్ట్ కార్డులో డబ్బు జమ చేయడానికి మాత్రం ఎక్కడా కష్టపడాల్సిన అవసరం లేదని, కానీ కాలం చెల్లిన గిఫ్ట్ కార్డు నుంచి డబ్బు రికవరీ చేయడం మాత్రం అత్యంత కష్టమైన ప్రక్రియ అని అభిప్రాయపడ్డారు. యూజర్లు కస్టమర్ కేర్ ను కాంటాక్ట్ చేయాలి... వారి పరిస్థితిని వివరించాలి...




ఆ తర్వాత ఎంతో సంక్లిష్టమైన సుదీర్ఘమైన ప్రక్రియను పూర్తి చేయాలి అని పవన్ వివరించారు. "కాలపరిమితి ముగిసిన గిఫ్ట్ కార్డు నుంచి డబ్బును వెనక్కి తీసుకునే ప్రక్రియ ఎందుకు సులభంగా, సరళతరంగా ఉండకూడదు? గిఫ్ట్ కార్డులో మనం ఉపయోగించుకోకుండా ఉన్న బ్యాలెన్స్ ఆటోమేటిగ్గా మన ప్రధాన ఖాతాలోకి గానీ, అమెజాన్ అకౌంట్ కు లింక్ అయి ఉన్న బ్యాంకు ఖాతాలోకి గానీ ట్రాన్స్‌ఫర్ అయితే బాగుంటుంది. తద్వారా ఎంతో సమయం ఆదా అవడమే కాదు... యూజర్లు తమ గిఫ్ట్ కార్డుల్లోని నగదును కోల్పోకుండా ఉంటారు.
ఈ-కామర్స్ వేదికలు తప్పనిసరిగా సులభతరమైన, పారదర్శకమైన, న్యాయమైన విధానాలను తీసుకురావాలి. యూజర్లకు కష్టం కలిగించని రీతిలో పరిష్కార మార్గాలు ఉంటే కోట్లాది మంది యూజర్లలో ఈ-కామర్స్ పోర్టళ్లపై నమ్మకాన్ని పెంచుతుంది. అందుకే, కోట్లాది మంది యూజర్లు ఎదుర్కొంటున్న గిఫ్ట్ కార్డుల సమస్యను పరిష్కరించేందుకు సులువైన మార్గాన్ని అన్వేషించాలని అమెజాన్ ను కోరుతున్నా" అంటూ పవన్ తన వ్యక్తిగత సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టారు.

# గద్దర్‌కు అవార్డు ఎట్లిస్తం?

(మొదటి పేజీ తరువాయి)
పెట్టుకున్నా అభ్యంతరం లేదని సెటైర్ వేశారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని, అయితే రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని అన్నారు. గత పదేళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం తెలంగాణకు ఖర్చు చేసిందని బండి సంజయ్ వివరించారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే జరిగిందని అన్నారు.
ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనేలేదని బండి సంజయ్ విమర్శించారు. మండలానికి ఒక గ్రామంలోనే నాలుగు పథకాలకు ఎంపిక చేసి లబ్ది చేయడమేంటని ప్రశ్నించారు. మిగిలిన గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేయలేదా? అని నిలదీశారు. రాష్ట్ర ప్రజలను ఇంత దుర్మార్గంగా మోసగిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలందరికీ లబ్ది చేకూరుస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామానికి లబ్ది చేకూర్చడం దారుణమని అన్నారు. గతంలో పీఎం ఆవాస్ యోజన పేరుతో 2 లక్షల 40 వేల ఇండ్లను కేంద్రం మంజూరు చేస్తే కేసీఆర్ ఒక్క ఇల్లు కట్టకుండా ప్రజలను రోడ్డున పడేసింది నిజం కాదా? అని గుర్తు చేశారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు.మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మావోయిస్టు కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కమ్యూనిస్టు భావజాలం వేరు, మావోయిస్టుగా చేయడం వేరని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం ఇవ్వాలని భావిస్తున్న గద్దర్ అవార్డులను మా వోళ్లు తీసుకోరని స్పష్టం చేశారు.

# రాజ్యాంగాన్ని పరిరక్షిస్తాం

(మొదటి పేజీ తరువాయి)
బీజేపీ పేరుతో కొనసాగుతున్న బ్రిటీష్ జనతా పార్టీని ఎదుర్కొనేందుకు రాహుల్ పోరాడుతున్నారని చెప్పారు. ఇది గాంధీ పరివార్, గాడ్సే పరివార్ ల మధ్య సాగుతున్న యుద్ధమని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని రక్షిస్తుందని, రిజర్వేషన్లు కాపాడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మధ్య ప్రదేశ్ లోని ఇండోర్ లో జరిగిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీకి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ, అమిత్ షా రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల సమయంలో బీజేపీ 400 సీట్లు అడిగిందని, అబ్ కీ బార్ చార్ సౌ పార్ అనే నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లిందని అన్నారు. ప్రజలు వాళ్ల కుట్రలను గ్రహించే 240 సీట్లకు పరిమితం చేశారని సీఎం రేవంత్ చెప్పారు. రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణ బీజేపీ విధానమని పేర్కొన్నారు. లోక్ సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డ నాటి నుంచి బీజేపీ నేతలు ఆందోళనలో ఉన్నారని అన్నారు. 2025 వాళ్లకు కీలకంగా మారిందని అన్నారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకే తాము జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహిస్తున్నామని సీఎం చెప్పారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలోనూ రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణే ధ్యేయమని చెప్పారని, దానికి కట్టుబడే కాంగ్రెస్ పార్టీ పోరాటాలు సాగిస్తోందని అన్నారు. బీజేపీకి అంబేద్కర్ పేరు అన్నా.. రాజ్యాంగం, రిజర్వేషన్లు అన్నా నవ్వులాటగా మారాయని అన్నారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి తదితరులు ఉన్నారు.

# గుల్లెయిన్ బారే సిండ్రోమ్‌తో తొలిమరణం

ముంబై,,జనవరి 27ప్రజావినికిడి::గుల్లెయిన్ బారే సిండ్రోమ్‌తో మహారాష్ట్రలో తొలి మరణం నమోదైనట్లుగా తెలుస్తున్నది. సోలాపూర్‌లో ఓ వ్యక్తి మరణించగా.. మరణానికి జీబీఎస్ కారణంగా మరణించినట్లుగా ఆరోగ్యశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో సిండ్రోమ్ బారినపడుతున్న రోగుల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉన్నది. పుణేలోనే వంద మందికిపైగా రోగులున్నారు. మృతుడిని సోలాపూర్ నివాసిగా గుర్తించారు. సదరు వ్యక్తి కొద్దిరోజుల కిందట పుణేకు వచ్చాడని.. ఆ సమయంలోనే సిండ్రోమ్ సోకినట్లుగా భావిస్తున్నారు. ఇమ్యునోలాజికల్ నరాల వ్యాధి గుల్లెయిన్ బారే సిండ్రోమ్ వ్యాప్తి పుణేలో ఎక్కువగా కనిపిస్తున్నది. ఆదివారం నాటికి సంఖ్య వందకుపైగా దాటింది. పుణేలో జీబీఎస్ సోకిన వారి సంఖ్య 101కి పెరిగింది. ఇందులో 68 మంది పురుషులు, మరో 33 మంది మహిళలు ఉన్నారు. ఇందులో 16 మంది రోగుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వారికి వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందిస్తున్నారు. పుణే మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన రాపిడ్ రెస్పాన్స్ టీం, ఆరోగ్యశాఖ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. ముఖ్యంగా పూణేలోని సింఘాడ్ రోడ్డులో గరిష్ఠ సంఖ్యలో రోగులను గుర్తించారు. ప్రస్తుతం ప్రత్యేకంగా నిఘా వేశారు. ఇప్పటివరకు, రాష్ట్రంలో 25,578 ఇళ్లను సర్వే చేశారు. ఇందులో 15,761 ఇండ్లు పుణే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. మరో 3,719 నివాసాలు చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. 6,098 ఇండ్లు రూరల్ ప్రాంతానికి వస్తాయి. గుల్లెయిన్ బారే సిండ్రోమ్.. జీబీఎస్ అనేది రోగనిరోధక నాడీ వ్యాధి. వ్యాధి సోకితే చేతులు, కాళ్లు అకస్మాత్తుగా తిమ్మిరి వస్తాయి. కండరాలు బలహీనంగా మారుతాయి. వ్యాధి లక్షణాల్లో బలహీనత.. విరేచనాలు ఉంటాయి. సాధారణంగా జీబీఎస్ సమస్య బాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్ రోగనిరోధక శక్తిని కూడా బలహీనంగా మారుస్తుంది. పిల్లలు, యువత ఎక్కువగా ఈ వ్యాధి బానిపడుతున్నారు. వ్యాధి బారినపడ్డ వారంతా కోలుకుంటుండడం విశేషం. తాగునీటిని శుభ్రంగా ఉంచుకోవాలని, మరిగించి చల్లార్చిన నీటినే తాగాలని ప్రభుత్వం ప్రజలకు సూచించింది. ఆహారం సైతం శుభ్రంగా ఉంచుకోవాలని.. కూరగాయాలను శుభ్రంగా కడుక్కోవాలని.. బాగా ఉడికించి తినాలని వైద్యశాఖ అధికారులు సూచించారు.

# పెట్టుబడులపై ప్రగల్భాలే

హైదరాబాద్ :,జనవరి 27ప్రజావినికిడి::౧
దావోస్‌కు పోయి సీఎం రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన పెట్టుబడులపై కాంగ్రెసోళ్లు పెట్టిన హోర్డింగ్స్ చూసి ఏడ్వాలో.. నవ్వాలో అర్థం కావడంలేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. సోమవా రం తెలంగాణ భవన్‌లో విద్యార్థి విభాగం డైరీని ఆయన ఆవిష్కరించిన అనంతరం ఆ యన మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి లక్షా 78వేల కోట్ల పెట్టుబడులు తెచ్చినట్లు బిల్డ ప్స్ ఇచ్చుడు కాదు, 2024లో కూడా రూ. 42వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని గవర్నర్ ప్రసంగంలో, బడ్జెట్ ప్రసంగంలో చె ప్పారు కానీ నేతిబీరకాయ చందంలాగా అందులో ఇవ్వాల్టికి ఒక్కటి కూడా రాలేద ని కేటీఆర్ తెలిపారు. అందుకే ప్రజలు మి మ్ముల్ని నమ్ముతలేరు, చేతనైతే ఎప్పటిలో గా పెట్టబడులు వస్తాయో చెప్పు, ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తా యో చెప్పు మేము సంతోషిస్తామని కేటీఆర్ ఎద్దేవ చేశారు. తెలంగాణకు పెట్టుబడులు వస్తే సంతోషించే వారిలో తాము ముందుం టాం, మాకంటే ఎక్కువ చేసి చూపెడితే మే ము నీకు సన్మానం కూడా చేస్తామని కేటీఆర్ అన్నారు. తమ పదేళ్ళ పాలనలో కొత్త రేషన్ కార్డులుఇవ్వలేదని కాంగ్రెస్ మంత్రులు అబద్దాలు అడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. 2021 లోనే మా ప్రభుత్వం ఆరు లక్షల 47 వేలకు పైగా కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని, ఆనాడు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో నేటి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కూడా పాల్గొన్నారని అన్నారు. పదేండ్ల బిఅర్ఏస్ పాలనలో అన్ని రకాలుగా విద్యారంగాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అప్పుడు 294 ఉన్న గురుకులాలు నుంచి వెయ్యికిపైగా పెంచుకున్నాం, ఐదు మెడికల్ కాలేజీలను జిల్లాకు ఒక మెడికల్, నర్సింగ్ కాలేజీల ఏర్పాటు చేసుకున్నాం, ఒక ఫారెస్ట్ యూనివర్సిటీ, మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసి వాటికి మహనీయుల పేర్లు పెట్టుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తో పాటు కాంగ్రెస్ నేతలంతా అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రాహుల్ గాంధీ తెలంగాణ యువతకు హామీ ఇచ్చి 400 రోజులు గడిచిన సందర్భంగా జనవరి 31 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గాంధీ విగ్రహాలకు నివాళులు అర్పించి నిరసన వ్యక్తం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల వైఫల్యాలను ప్రతి ఇంటికి తీసుకుపోవాలన్నారు.


# వక్ఫ్ (సవరణ) బిల్లు కు (జెపిసి) ఆమోదముద్ర


(మొదటి పేజీ తరువాయి)
వక్ఫ్ ట్రిబ్యునల్ల సభ్యులనుఇద్దరి నుంచి ముగ్గురికి పెంచడాన్ని అనుమతిస్తాయి.బిల్లులోని 14 క్లాజుల్లో ఎన్‌డిఎ సభ్యులు ప్రవేశపెట్టిన సవరణలను ఆమోదించినట్లు కమిటీ చైర్మన్ తెలియజేశారు. ప్రతిపక్ష సభ్యులు 44 క్లాజుల్లో వందలాది సవరణలు ప్రవేశపెట్టినట్లు, వాటిని కమిటీ తిరస్కరించినట్లు జగదంబికా పాల్ చెప్పారు. ముసాయిదా నివేదికను మంగళవారం (28) కల్లా పంపిణీ చేయనున్నట్లు, బుధవారం దానిని లాంఛనంగా ఆమోదించనున్నట్లు జెపిసి ప్రకటించింది. వక్ఫ్ (సవరణ) బిల్లు 2024ను కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు నిరుడు ఆగస్టు 8న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. శీతాకాల సెషన్‌లోనే బిల్లును ప్రవేశపెడతారని భావించారు. కానీ విస్తృత పరిశీలన కోసం జెపిసికి నివేదించారు.

# ప్రపంచాభివృద్ధిలో భారతదేశ యువత కీలక భూమిక

న్యూఢిల్లీ,,జనవరి 27ప్రజావినికిడి: ప్రపంచాభివృద్ధిలో భారతదేశ యువత కీలక భూమిక వహిస్తోందని, వీరి భాగస్వామ్యం లేకుండా ప్రపంచాభివృద్ధిని ఊహించలేమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దశాబ్దాలుగా దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలను తొలగించేందుకు తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఢిల్లీలోని కరియప్ప గ్రౌండ్స్‌లో సోమవారంనాడు జరిగిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ర్యాలీలో ప్రధాని పాల్గొన్నారు. ఎన్‌సీసీ డవలప్‌మెంట్‌కు గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పనితీరు తనకు చాలా సంతృప్తిని ఇచ్చిందని మోదీ అన్నారు. 170 సరిహద్దు ప్రాంతాలు, సుమారు 100 తీరప్రాంత సరిహద్దులకు ఎన్‌సీసీ క్యాడెట్లు విస్తరించారని, తద్వారా ఆయా ప్రాంతాల్లో నివసించే వారికి ఎంతో ప్రయోజనం చేకూరిందని చెప్పారు. 'ఒకే దేశం ఒకే ఎన్నికలు'పై డిబేట్‌ను ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు కొనసాగిం చాలని, దేశ యువత భవిష్యత్తుకు ఏకకాలంలో ఎన్నికలు కీలకమని అన్నారు. ప్రతి నెలలోనూ ఎన్నికలు జరుగుతూ పోతుంటే కాలేజీలు, విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు సమయం ఎక్కడ దొరుకుతుందని ప్రశ్నించారు. వికసిత్ భారత్' ఉద్దేశాలపై ఎన్‌సీసీ క్యాడెట్లతో సహా దేశ యువత దృష్టిసారించాలని మోదీ కోరారు. దేశ వికాశంతోనే భారత్ అంతర్జాతీయంగా ఉన్నత స్థాయికి చేరుకుంటుందన్నారు. 2014లో 14 లక్షల మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 20 లక్షలకు చేరుకుందని, వీరిలో 8 లక్షల మందికి పైగా మహిళలే ఉండటం గర్వకారణమని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫార్మ్‌డ్ యూత్ ఆర్గనైజేషన్‌గా ఎన్‌సీసీ నిలవడం, డిజాస్టర్ మేనేజిమెంట్‌తో సహా అన్ని రంగాలకు ఎన్‌సీసీ సేవలు విస్తరిస్తుండటం ముదావహమని చెప్పారు.

# సూర్యాపేటలో మరో పరువు హత్య?





సూర్యాపేట,,జనవరి 27ప్రజావినికిడి:సూర్యాపేటలోని మామిల్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి హత్యకు హత్యకు గురయ్యాడు. పిల్లలమర్రి సమీపంలోని మూసీ కాలవ కట్టపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిల్లల మర్రికి చెందిన నవీన్, కృష్ణ స్నేహితులు. తరచూ పిల్లలమర్రిలోని నవీన్ ఇంటికి వస్తూ పోతున్న కృష్ణ నవీన్ సోదరి భార్గవిని ప్రేమించాడు. వీరి ప్రేమను భార్గవి తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో ఆరు నెలల క్రితం భార్గవిని కృష్ణ కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్గవి, కృష్ణ ఇద్దరూ సూర్యాపేటలో కాపురం పెట్టాడు. ప్రేమ పెళ్లిని నిరాకరించిన భార్గవి తల్లిదండ్రులు వారిని విడదీసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కులాంతర వివాహం చేసుకున్న బంటిపై భార్గవి సోదరుడు నవీన్ కక్ష పెంచుకున్నాడు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో మహేష్ అనే మిత్రుడి నుంచి ఫోన్ కాల్ అందుకున్న కృష్ణ భార్యకు ఫోన్ ఇచ్చి బయటకు వెళ్లాడు. రాత్రి లేట్ అయినా కృష్ణ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సూర్యాపేట జనగాం క్రాస్ రోడ్ నుండి పిల్లల మర్రికి వెళ్లే మూసి కెనాల్ కట్టపై కృష్ణ మృతదేహం పడి ఉంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కృష్ణ బంధువులు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగులు మృతుడి మెడకు ఉరి వేసి చంపినట్లు గుర్తులు కన్పిస్తున్నాయి. మృతుడి ఒంటిపై కమిలిన గాయాలున్నాయి. నిందితులను గుర్తించేందుకు పోలీసులు గాలిస్తున్నారు. భార్గవి సోదరుడు కోట్ల నవీన్ హత్యకు పాల్పడ్డట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు కృష్ణ పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ హత్యకు ప్రేమ వివాహమే కారణమా, లేక పాత కక్షలే కారణమా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం
# మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ మంజూరు

హైదరాబాద్,,జనవరి 27ప్రజావినికిడి:
తెలంగాణలో అత్యంత సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నాళ్లు అరెస్ట్‌లు, దర్యాప్తులు, విచారణల తర్వాత– ఈ కేసులో ఫస్ట్ బెయిల్ వచ్చింది. మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ లభించింది. షరతులతో కూడిన బెయిల్ ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది. ట్యాపింగ్ కేసులో 10 నెలలుగా జైల్లో గడిపారు మాజీ పోలీస్ అధికారి తిరుపతన్న బెయిల్ అనంతరం విడుదల కానున్నారు. రాజకీయ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని మాజీ ఏఎస్పీ తిరుపతన్నపై ఆరోపణలు ఉన్నాయి. ఆధారాలు చెరిపేయడంలోనూ ఆయనదే కీలక పాత్ర అనే అభియోగాలు కూడా ఉన్నాయి. 2023 డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చేసిట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో అరెస్టైన తిరుపతన్న పది నెలలుగా జైలులో ఉండగా.. తాజాగా ఆయనకు బెయిల్ ఇచ్చింది సుప్రీం కోర్ట్. వాస్తవానికి ఫోన్ ట్యాపింగ్ కేస్ లో అరెస్ట్ అయ్యిన వారిలో మొదటి వ్యక్తి తిరుపతన్న.. ఫోన్ ట్యాపింగ్ కేసులో నలుగురిని గత ఏడాదిలో హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.. అడిషనల్ ఎస్పీ ప్రణీత్ రావ్, అడిషనల్ ఎస్పీ భుజంగ రావ్, అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావ్ లను పోలీసులు అరెస్ట్ చేసారు. దాదాపు 10 నెలలకు పైగా జైల్ లోనే ఉన్నారు. బయటికి వచ్చేందుకు అనేక సార్లు బెయిల్ పిటిషన్ లు దాఖలు చేసినప్పటికీ రిజెక్ట్ అవుతూ వచ్చాయి. హై కోర్టులో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ ఇక్కడ ఊరట లభించలేదు. తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించగా అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తిరుపతన్నను గత ఏడాది 24న ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అదే సమయంలో మరో అడిషనల్ ఎస్పీ భుజంగరావు ఉన్న సైతం పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ అనేకసార్లు లోయర్ కోర్టుతో పాటు హైకోర్టులోను బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు ఎవరికీ పూర్తిస్థాయిలో బెయిల్ మంజూరు కాలేదు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగింది. రాజకీయ ప్రత్యర్థులు, హైకోర్టు జడ్జిలు, జర్నలిస్టుల ఫోన్లను ట్యాప్ చేసినట్టు పోలీసులు ఆరోపణలు మోపారు.. వీటికి సంబంధించి కోర్టులో ఇంకా కేసులు నడుస్తూనే ఉన్నాయి. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ పొందిన మొదటి వ్యక్తి తిరుపతన్న.. సుప్రీం కోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదల కానున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
మంగళవారం 28 జనవరి 2025

## రమాదేవి కు జిల్లా ఉత్తమ కార్యదర్శి అవార్డు



**అనంతగిరిజనవరి 27**ప్రజావినికిడి: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని చనుపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రమాదేవికు జిల్లా ఉత్తమ పంచాయతీ కార్యదర్శి గా సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందా లాల్ పవర్ చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. వీధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు 76వ గణతంత్ర దినోత్సవం గాను ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు ఉద్యోగులు రమాదేవి కు శుభాకాంక్షలు తెలియజేశారు...

## బ్రోచర్ ను ఆవిష్కరించిన ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షులు కారింగుల అంజన్ గౌడ్..



**కోదాడ జనవరి 27**ప్రజావినికిడి: కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు ఈనెల 30 తారీఖున పట్టణంలోని ఎమ్మెస్ కళాశాల ఆవరణలో గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన గౌడ్ పేర్కొన్నారు. గ్రాండ్ టెస్ట్ కు సంబంధించి సోమవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మీడియా సభ్యులతో కలిసి గ్రాండ్ టెస్ట్ బ్రోచర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు అభినందించారు. విద్యార్థులలో ప్రతిభను వెలికి తీసేందుకు ఈ గ్రాండ్ టెస్ట్ ద్రోహదపడుతుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోదాడ ,అనంతగిరి, మునగాల, నడిగూడెం, మోతే, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఈ విషయం తెలియజేసి విద్యార్థులను గ్రాండ్ టెస్ట్ కు హాజరయ్యేలా చూడాలని కోరారు.ఈ గ్రాండ్ టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతి 5016, రెండవ బహుమతి 3,016,మూడవ బహుమతి 2016 అందజేయనున్నట్లుగా తెలిపారు. సంప్రదించిన నెంబర్ల,9701415412 ఈ కార్యక్రమంలో.. సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, హరికిషన్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పడిశాల రఘు, పూర్ణచంద్రరావు, లక్ష్మణ్, వెంకటనారాయణ, గోపాలకృష్ణ, నరేష్, సత్య రాజు, పవన్, నజీర్, రహీం, వీరబాబు, సైదులు రమేష్, మనీ తదితరులు పాల్గొన్నారు

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి...

### మాజీ ఎమ్మెల్యేబొల్ల మల్లయ్య యాదవ్




**అనంతగిరి:జనవరి 27**ప్రజావినికిడి: కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలు అప్లై చేసుకోవడం తప్ప రిప్లై రావడంలేదని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్ల మల్లయ్య యాదవ్ అన్నారు.సోమవారం అనంతగిరి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు..పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా అని అన్నారు.స్థానిక ఎన్నికలలో సత్తాచాటాలి అని పిలుపునిచ్చారు.ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం అయింది అని తెలిపారు. సంవత్సరం కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి వచ్చింది అని ఆయన అన్నారు. కాంగ్రెస్ వికృత వైఖరి పట్ల గ్రామ గ్రామాన చర్చలు పెట్టాలి. ప్రజలు, రైతులు, యువత అందరికీ అర్థమయ్యేలా వివరించాలి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నల్ల భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గులోత్ శ్రీనివాస్ నాయక్, మాజీ సొసైటీ చైర్మన్ ఉషారాణి హనుమంతరావు, పార్టీ నాయకులు మట్టపల్లి పుల్లయ్య గౌడ్, పూర్ణచందర్, అఫ్జల్, బిక్షం, మట్టపల్లి సైదులు, అన్ని గ్రామాల గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు, మాజీ సర్పంచ్లు ఎంపీటీసీలు, సింగల్ విండర్ డైరెక్టర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హుస్సేన్ సాగర్ ఘటనలో ఆచూకీలేని యువకుడు

## పోలీసుల గాలింపులో కానరాని ఆనవాళ్లు

హైదరాబాద్,,**జనవరి 27**ప్రజావినికిడి:
హుస్సేన్‌సాగర్ లో రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం ఘటనలో ఓ యువకుడి ఆచూకీ తెలియడంలేదు. అగ్ని ప్రమాదంలో రెండు బోట్లు దగ్ధమవగా ఒక్క బోటులో ఫ్రండ్స్‌తో వెళ్లిన అజయ్ (21) అనే యువకుడు కనిపించడం లేదు. అజయ్‌తోపాటు వెళ్లిన ఫ్రండ్స్ మాత్రం సురక్షితంగా బయటపడ్డారు. అజయ్ ఏ ఆస్పత్రిలోనూ లేదని పోలీసులు చెబుతుండడంతో అతని కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. అజయ్ ఫ్రండ్స్ నుంచి లేక్ పోలీస్ స్టేషన్ పోలీసులు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో లేక పోలీసులు పడవలతో సాగరన్ చుట్టే గాలించినా ఫలితం లేకుండా పోయింది. కాగా భరతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద 'భరతమాత మహా హారతి' కార్యక్రమం నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. రెండు బోట్లలో బాణసంచా పేల్చడానికి కొందరు యువకులు రెండు బోట్లలో హుస్సేన్‌సాగర్ మధ్యలోకి వెళ్లారు. బాణసంచా కాలుస్తుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి అగ్నిప్రమాదం సంభవించింది. నిప్పురవ్వలు తిరిగి అవే బోట్లలో ఉంచిన బాణసంచాపై పడటంతో బోట్లకు మంటలు వ్యాపించాయి. దీంతో రెండు బోట్లు దగ్ధం కాగా.. అందులో ఉన్నవారు స్వల్పగాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. వారిలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి



విషమంగా ఉన్నట్లు సమాచారం. నాగారానికి చెందిన అజయ్ తన కొలిగ్స్‌తో కలిసి హుస్సేన్‌సాగర్‌కు వచ్చాడు. అయితే బోట్స్‌లో అజయ్ ఉన్నట్లు ఫ్రండ్స్ చెబుతున్నారు. బోట్‌లో అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అందులో ఉన్నవారు అందరూ నీటిలోకి దూకారు. అదే సమయంలో అజయ్‌తోపాటు అతని స్నేహితులు ఉన్నారు. వారు సురక్షితంగా బయటపడ్డారు. అయితే అజయ్ ఆచూకీ మాత్రం లభించలేదు. దీంతో అతని కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అజయ్ ఎక్కడా ఏ ఆస్పత్రిలో జాయిన్ కాలేదని.. ఇదే విషయాన్ని పోలీసులు కూడా స్పష్టం చేశారు. అజయ్ అనే పేరుతో ఎవరూ ఆస్పత్రిలో జాయిన్ కాలేదని, క్షతగాత్రుల వివరాల్లో అజయ్ పేరు లేదని పోలీసులు తెలిపారు. దీంతో అజయ్ ఏమయ్యాడనే ఆందోళన కుటుంబసభ్యుల్లో నెలకొంది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆదివారం రాత్రి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన 'భరతమాత మహా హారతి' కార్యక్రమంలో ఆయనతోపాటు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అయితే కార్యక్రమం పూర్తయ్యాక పీపుల్స్ ఎ÷-లాజా సమీపంలో వేదిక వెనుక భాగంలో బాణసంచా కాల్చేందుకు పర్యాటక శాఖకు చెందిన రెండు బోట్లలో సామగ్రిని హుస్సేన్‌సాగర్ మధ్యలోకి తీసుకెళ్లారు. బోటులో డ్రైవర్, వాల్టర్, సిబ్బంది, బాణసంచా కాల్చే ఐదుగురు నిపుణులతోపాటు 15 మంది బీజేపీ కార్యకర్తలు ఉన్నారు. అయితే బాణసంచా కాల్చే క్రమంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో బోట్లలో ఉన్న కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు నీళ్లలోకి దూకారు. రంగంలోకి దిగిన అధికారులు.. జెట్టీలో మంటలను అదుపులోకి తెచ్చే పరికరాలు లేకపోవడంతో వారిని స్పీడ్‌బోట్‌లో బయటకు తీసుకువచ్చారు. అయితే ప్రమాదంలో బాణసంచా కాల్చే నిపుణుడు గణపతి (22)కి తీవ్ర గాయాలయ్యాయి. ఇతనితోపాటు ప్రమాదంలో గాయపడిన చింతల కృష్ణ (47), కరీంనగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి సాయిచంద్‌ను సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గణపతి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, సీతాఫల్‌మండికి చెందిన బీజేపీ కార్యకర్తలు సునీల్, ప్రణీత్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, కాలిపోయిన లూంబిని బోట్ విలువ రూ.12 లక్షలు ఉంటుందని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

# ఆర్‌టిసిలో సమ్మె సైరన్

**%యాజమాన్యానికి నోటీసుఇచ్చిన కార్మిక సంఘాలజెఎసి**
**ప్రభుత్వంలోవిలీనం, రెండు పిఆర్‌సిలచెల్లింపు సహా యాజమాన్యంముందు 21 డిమాండ్లు**
**45 రోజుల్లోగా పరిష్కరించకపోతే సమ్మె బాట**

హైదరాబాద్ **జనవరి 27**ప్రజావినికిడి:
తెలంగాణ ఆర్‌టిసిలో సమ్మె సైరన్ మోగింది. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె బాట పడుతామని కార్మిక సంఘాల జెఎసి ఆర్‌టిసి యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చింది. సోమవారం బస్‌భవన్‌లో జెఎ సి నేతలు అధికారులకు సమ్మె నోటీసు అందజేశా రు. సమ్మె నోటీసులో 21 డిమాండ్లను జెఎసి నేత లు యాజమాన్యం ముందుంచారు. వాటిని పరిష్కరించాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి 45 రోజుల గడువు ఇస్తున్నామని అప్పటికీ తమ డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్రంలోని అన్ని డి పోల కార్మికులు సమ్మెబాట పడుతారని సమ్మె నో టీసులో హెచ్చరించారు. ప్రభుత్వంలో ఆర్‌టిసి ఉ ద్యోగుల విలీనం, 2 పిఆర్‌సిల అమలు, సిపిఎస్, పిఎష్ డబ్బులు రూ. 2,700 కోట్లు చెల్లింపు తదితర 21 డిమాండ్లు యాజమాన్యం ముందు ఉం చారు.
డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెకు దిగుతామని నోటీసుల్లో పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల కొ నుగోలు, నిర్వహణను ప్రైవేటు కంపెనీలు చేస్తున్నాయి. వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. కార్మిక సంఘాల నేతలు కోరారు. ఆర్‌టిసిలో కొత్త గా ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో అద్దె వాహనాలను తీసుకుంటున్నారని, ఈ బస్సులు, అందులో పనిచేసే డ్రైవర్ ఆర్‌టిసికి సంబంధం లేదని జెఎసి నా యకులు పేర్కొన్నారు. ఈ బస్సు మీద ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ ప్రైవేటు వ్యక్తులకే చెందుతోందని, అందువల్ల ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్‌టిసికి అందజేయాలని సమ్మె నోటీసులో పేర్కొన్నారు. ఆర్‌టిసి డీజిల్ బస్సులను రెట్రో ఫిట్‌మెంట్ పాలసీపై



ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చే విధానాన్ని మానుకోవాలని కోరారు.
ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు నిర్వహించడం లేదని, యూనియన్లు రద్దు చేసి, కార్మికులకు పనిగంటలు పెంచారని, జెఎసి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున కార్మిక సంఘాల నేతలు బస్ భవన్ వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు.

గతంలోనే నిర్ణయం తీసుకున్నాం : జెఎసి

ఆర్‌టిసి పరిరక్షణకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలంటూ సమ్మె నోటీస్ ఇవ్వాలని ఆర్‌టిసి జెఎసి ఈనెల 22న ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకుందని ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్‌ఛైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా, తెలంగాణ ఆర్‌టిసి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలుచేయలేదని వారు విమర్శించారు. ప్రైవేట్ సంస్థల ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో కార్పొరేట్ సంస్థలకు ఆర్‌టిసిని కట్టబెడుతున్నారని ఆరోపించారు.

14 నెలలైనా సమస్యలు పరిష్కారం కాలేదు : వెంకన్న

'ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతుందని, సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నుండి మంత్రుల వరకు అందరిని కలిశామని ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న అన్నారు అయినా మా సమస్యలను పరిష్కరించలేదన్నారు. గత ప్రభుత్వం విలీన ప్రక్రియను 90 శాతం పూర్తి చేసింది, కాని కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. 2021 పీఆర్సీ ఇవ్వడంలేదన్నారు. 14 నెలలు సమయం ఇచ్చామని ఇక ఓపిక లేదని చెప్పారు. ఆర్‌టిసిని అభివృద్ధి చేస్తామని చెప్పి ప్రైవేటు బస్సులు ఆర్‌టిసిలో ప్రవేశపెట్టి సంస్థ మనుగడకే ప్రమాదం కలిగేలా చేస్తున్నారని ఆయన ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

2021 పిఆర్‌సిని ప్రకటించి బకాయిలు చెల్లించాలి : థామస్ రెడ్డి

'కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చెప్పినట్టు ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని జెఎసి వైస్ చైర్మన్ థామస్ రెడ్డి అన్నారు. కార్మికుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని, 2021 పిఆర్‌సిని ప్రకటించి, 2017 బకాయిలు చెల్లించాలన్నారు. 15 రోజుల్లో యాజమాన్యం స్పందించి మా డిమాండ్స్ నెరవేర్చాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలను కలిసి సమ్మెకు మద్దతు కూడగడుతామన్నారు.

# హెూమియోపతి మహిళా ఉపాధ్యాయినులకు శ్రీమతి సావిత్రి బాయి పూలె అవార్డ్స్ ప్రధానం..

ప్రజావినికిడి,(హిమాయత్ నగర్):
హెూమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హిమాయత్ నగర్ జూపల్లి బాలమ్మ ఆడిటోరియం లో నిర్వహించిన కార్యక్రమంలో సావిత్రి బాయి పూలే 194 వ జయంతి ని పురస్కరించుకొని, తెలంగాణలోని అన్ని హెూమియో కాలేజీల మహిళా ఉపాధ్యాయిను లకు ఇద్దరికి చొప్పున శ్రీమతి సావిత్రి బాయి పూలే ఎక్సెన్స్ 2025 అవార్డులను ప్రధానం చేసి సత్కరించారు.అసోసియేషన్ అధ్యక్షుడు డా.కె. గోపాలకృష్ణ అధ్యక్షతన స్వాగతోపన్యాసం చెయ్యగా,ప్రధాన కార్యదర్శి డా.గన్నంరాజు దుర్గాప్రసాద్ రావు సావిత్రిబాయి పూలే జీవిత విశేషాలు తెలియజేశారు.అవార్డులు అందుకున్న



వారిలో డా. పి.సత్యవేణి,డా.జె. ఇందిర (జె.యస్.పి యస్) , డా.టి.రాజేశ్వరి,డా. సి.రాధా దేవి (దేవ్స్) డా.ఎ.శ్రీహరిత,డా. కె.రత్నకుమారి ( ఎం.ఎన్.ఆర్ ) డా.పూనమ్ నారాయన్ సుతార్ , డా.రమ్యకృష్ణ (జిమ్స్) డా.విజయ సాగరిక డి.



డా.పుష్పలత ( హంస ) డా.బి.వై. రేణుక,ప్రిన్సిపాల్ , డా,వి.రేఖ ( గురునానక్ ) ఉన్నారు.అధ్యక్షుడు గోపాలకృష్ణ అందరిని అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు.


# లోక కళ్యాణం కొరకై రుద్ర సహిత శత చండీయాగం..

## శ్రీకాంతగిరి శ్రీమాతా క్షేత్రంలో రుద్ర సహిత శత చండీయాగ మహోత్సవం..

**పాల్గొన్న మాజీ మంత్రులు ఎమ్మెల్యే లు హరీష్ రావు.. సబితా ఇంద్రా రెడ్డి.. మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్..**

**శత చండీయాగంలో ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి దంపతులు..**

ప్రజావినికిడి,(రంగారెడ్డి):
పూర్వకాలము నుంచి మన భారత దేశం యజ్ఞ యాగాదులకు పుట్టినిల్లు లాంటిది. ప్రజల శ్రేయస్సు కోరి, ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధి చేయడానికి రాజులు మహారాజులు ఎందరో ఎన్నో రకాల యజ్ఞాలు యాగాలు చేసినట్టు మనం పురాతన గాథల్లో చదువుతూనే ఉన్నాం. ప్రజలు పీడిత పరిస్థితులలో ఉన్నప్పుడు,ప్రజా సంక్షేమం సరిగ్గా లేనప్పుడు,ప్రజలు బాధావస్థలలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమం కోసం ఆ భగవంతున్ని తృప్తి పరచడం కోసం యజ్ఞ యాగాది క్రతువులు, వేదమంత్రోచ్చరణాల మధ్య చేయడం మన భారతీయ సంస్కృతి ఇంతకుముందు కూడా చూస్తే తెలంగాణ



పోరాటం చేసి తెలంగాణను సాధించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా రాష్ట్ర ప్రజలందరి అభ్యున్నతి కోసం ఇలాంటి యాగాలే చేశారు.అని హరీష్ రావు అన్నారు.అలాగే రంగారెడ్డి జిల్లా, కందుకూర్ మండలం, దాసర్లపల్లి గ్రామం శ్రీకాంతగిరి శ్రీమాతాక్షేత్రంలో శ్రీ రుద్ర సహిత శత చండీయాగ మహోత్సవం 108 గుండాలతో నిర్వహించారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలను తీర్చుతూ ప్రజల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ,ఎక్కడ దేవాలయాలు నిర్మించిన తన వంతుగా భారీ విరాళాలు ప్రకటిస్తూ, ప్రజల మనిషిగా పేరు ఉన్న ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి సతీ సమేతంగా



రుద్ర సహిత శత చండీయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరితోపాటు, నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, సుఖశాంతులతో ఉండాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ యాగ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు హరీష్ రావు,సబితా ఇంద్రా రెడ్డి,మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాజీ, షాద్ నగర్ మాజీ భార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్మోహన్ రెడ్డి ప్రజా ప్రతినిధులు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిరు పేదలందరికీ ఇండ్లు ఇవ్వాలి..

**సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు..ఆందోజు రవీంద్ర చారి.. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి..**

ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
ఆర్కే నగర్లో సొంత ఇల్లు లేకుండా కిరాయికి ఉంటున్న నిరుపేదలందరికీ ఇంటి స్థలంతో పాటు ఇల్లు కట్టించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి అలాగే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు.భారత కమ్యునిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సీపీఐ ఆర్కే నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆర్కే నగర్ చౌరస్తా లో ఏర్పాటు చేసిన బహిరంగా సభకి ముఖ్య అతిధులుగా హాజరు అయినా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యదిరెడ్డిమాట్లాడుతూ,76 ఏళ్ల గణతంత్ర





దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న సందర్భంలో కొంత మంది మూరు?లు భారత రాజ్యాంగాన్ని మార్చాలని మాట్లాడుతున్నారు.అలాంటి వారి నుండి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అదేవిధంగా రాజ్యాంగం పూర్తి స్థాయిలో అమలు కొరకు కృషి చేయాలని అన్నారు.ఆర్కే నగర్ తో పాటు అనేక చోట్ల వేలాది మంది పేద ప్రజలు సొంత ఇండ్లు లేక కిరాయి ఇండ్లలో నివాసం ఉంటున్నారూ అలాంటి వాళ్ల అందరికీ ప్రభుత్వమే సొంత ఇంటి స్థలం నిర్మాణం చేసి ఇవ్వాలని అన్నారు.బుధాన్ భూముల్లో గుడిసెలు వేసుకున్న నీరు పేద ప్రజలందరికీ పట్టాలతో పాటు ఇంటి నిర్మాణానికి సరిపడ ఆర్థిక సహకారం కూడా ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.దేశ వ్యాప్తంగా ఏడాది పాటు జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.దేశంలో కులం పేరుతో మతం పేరుతో జరిగే దాడులకు అలాగే స్త్రీల మీద జరిగే అన్ని రకాల హింసలకి వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. సీపీఐ పార్టీ నిరంతరం పేద ప్రజల పక్షాన కొట్లాడే పార్టీ అని ఇప్పటికే ముడు చోట్ల గుడిసెలు వేసి విజయం సాధించాం భవిష్యత్ లో కూడా ఇండ్ల స్థలాలు ఇండ్లు లేని పేదల కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని అన్నారు.భారత కమ్యునిస్టు పార్టీ (సీపీఐ) ఆర్కే నగర్ శాఖ కన్వీనర్ బైరగోని రాజు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో 12వ వార్డ్ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్,మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్,ప్రజా నాట్య మండలి వేణు,సీపీఐ ఆర్కే నగర్ శాఖ సభ్యులు నర్సింహ,ఉప్పలయ్య, గోపీ,శోభన్ బాబు,జామిళ, కనకమ్మ, అనసూయ,శ్రీలత, గంగా,వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సీసీ బాలికల సీనియర్ కంటెంజెంట్ కమాండర్ గా 'కిరత్ ఉల్ ఐన్'

**గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బహుమతి..**

**పేరేడ్ గ్రౌండ్ ఉత్సవాల్లో అకట్టుకున్న ఎన్ సీసీ బాలికల ర్యాలీ..**

ప్రజావినికిడి,(సికింద్రాబాద్):
గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఎన్ సీసీ తెలంగాణ రాష్ట్ర బాలికల క్యాడెట్స్ కవాతు బహుమతి గెలుచుకుంది.తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా,రాష్ట్ర ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి,మంత్రుల సమక్షంలో బాలికల సీనియర్ కంటెంజెంట్ కమాండర్ కిరత్ ఉల్ ఐన్ (టిజి22%ఎా% డబ్ల్యూ ఎ118246) బహుమతి తీసుకుంది. నాచారంలో ని సెంయిట్ పయస్ డిగ్రి, పీజీ కళాశాలలో కిరత్ ఉల్ ఐన్ డ్రిగ్రి బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.తండ్రి అబ్దుల్ నజీర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తల్లి షబానా బేగం షేషాపహాడ్ నార్త్ లాలాగూడకు నివాసి, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కంటింజెంట్ కమాండర్ కిరత్-ఉల్-ఐన్ నేతృత్వంలోని బాలికల ర్యాలీకి బహుమతి లభించడం పట్ల కళాశాలతో పాటు విద్యార్థినీ తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.





# గవర్నర్ ను కలిసిన వృక్ష జీవి డాక్టర్ మార్కండేయులు..



ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్ భవన్ లో ఏర్పాటు చేసిన తేనేటి విందుకు ఆహ్వానం మేరకు వృక్షజీవి డాక్టర్ మార్కండేయులు హాజరవడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ గవర్నర్ గౌరవనీయులు శ్రీమతి %ఙ% శ్రీ సుధా జిష్ణు దేవ్ వర్మాజీ తో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి గౌరవనీయులు ఎనుముల రేవంత్ రెడ్డి నిఅలాగే తెలంగాణ మంత్రి వర్గం ని మర్యాదపూర్వకంగా కలిసి గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలియపరచడం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ,డాక్టర్ మార్కండేయులు వృత్తిరీత్యా వైద్యంతోపాటు పర్యావరణ పరిరక్షణ మీద చేస్తున్న సేవ ఎంతో విలువైనదని, వారూ చేస్తున్న సేవలను గుర్తు చేస్తూ వారికి అభినందనలు తెలిపారు.

# ఉపాధ్యాయులు తహసీల్దార్ కు వినతిపత్రం అందజేత..

ప్రజావినికిడి,(నాగర్ కర్నూల్):ద
కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కొరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంకు బదులుగా నూతనంగా యునైటెడ్ పెన్షన్స్ స్కీం తీసుకురాగా దీనిని వ్యతిరేకిస్తూ (పిఆర్టియు) ఉప్పునుంతల మండలంలో పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యునైటెడ్ పెన్షన్స్ స్కీమ్ (యుపిఎస్)లో చేరకూడదని, సోమవారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండల తాసిల్దార్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. గతంలో ఇచ్చిన విధంగానే(ఓ పిఎస్)పద్ధతిలో ఇవ్వాలని కోరారు. (పిఆర్టియు టీఎస్)నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు భిచ్యా నాయక్,రాష్ట్ర బాధ్యులు మల్లికార్జున్,అస్మాదుల,శ్యాంసుందర్,మరియు ఉప్పునుంతల మండల ప్రధాన కార్యదర్శుల నరసింహారెడ్డి అమీర్ పాషా జిల్లా బాధ్యులు నీలా శ్రీధర్ సీనియర్ నాయకులు రాములు నాయక్ శ్రీనివాస్ గోపి రాజ వర్ధన్ రెడ్డి పాల్గొనడం జరిగింది.




# ఎలక్షన్లలో మందు పంచితే లీడర్ కు రూ.4 లక్షల జరిమాన..

**ఉప్పరిగడ్డ గ్రామపంచాయతీలో గ్రామ పెద్దల సంచలన నిర్ణయం..**

**మందు అమ్మితే రూ 40వేలు..కొంటె 20వేలు..**




ప్రజావినికిడి,(షాద్ నగర్):
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని ఫరుక్ నగర్ మండలం ఉప్పరిగడ్డ గ్రామపంచాయతీ పెద్దలు మద్యం విషయంలో కఠిన నియమాలు విధించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లకు మందు పంచే నాయకులకు ఏకంగా నాలుగు లక్షల జరిమానా విధిస్తున్నారు. అంతేకాదు మందు అమ్మితే షాపు యజమానికి 40,000, మందుకొన్న వ్యక్తికి 20వేల రూపాయల జరిమానా విధిస్తామని గ్రామంలో పెద్దలు తీర్మానించారు. అదేవిధంగా మద్యం పంచుతున్న లేదా అమ్ముతున్న సమాచారాన్ని గ్రామ పెద్దలకు తెలియజేస్తే పదివేల రూపాయల పారితోషకం అందజేస్తామని గ్రామ మాజీ సర్పంచ్ నాయకుడు చందు నాయక్ మీడియాతో పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దల తీర్మానం నిర్ణయాలను షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో దీని ప్రతిని పట్టణ సీఐ విజయకుమార్ కు అందజేశారు. గ్రామంలో సంపూర్ణ మధ్య నిషేధం ఉంటుందని ఇక్కడ మద్యం బెల్ట్ షాపుల ద్వారా ఎవరు అమ్మరాదు కొనరాదని వారు హెచ్చరించారు. పోలీసులు కూడా తమ గ్రామపంచాయతీ తోపాటు దీని పరిధిలో ఉన్న తాండాల ప్రజలకు సహకరించి మద్యనిషేధం కొనసాగే విధంగా సహకరించాలని కోరారు.

# ఫాస్ట్ బ్రిక్ మైండ్స్ 3-ఆన్-3 టోర్నమెంట్‌లో ప్రతిభ చాటిన సెయింట్ ఆండ్రూస్ స్కూల్ విద్యార్థులు..






ప్రజావినికిడి,(హైదరాబాద్):
సెయింట్ ఆండ్రూస్ స్కూల్ ఫాస్ట్ బ్రిక్ మైండ్స్ గ్రూప్ 3-ఆన్-3 బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొని అండర్-15 బాయ్స్, అండర్-15 గర్ల్స్, అండర్-13 బాయ్స్ విభాగాల్లో అద్భుతమైన ఫలితాలను సాధించింది.అండర్-13 బాయ్స్ ఫైనల్‌లో కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌తో తలపడి 15%-%10 స్కోరు సాధించడం జరిగింది. కిరణ్ ఇంటర్నేషనల్ తరపున యశ్వంత్ 6 పాయింట్లు,సంజయ్ 9 పాయింట్లు సాధించగా,సెయింట్ ఆండ్రూస్ తరపున రేవంత్ 5 పాయింట్లు, ఆర్యన్ 5 పాయింట్లు అందించారు.అండర్-13 గర్ల్స్ ఫైనల్‌లో సెయింట్ ఆండ్రూస్ హోలి ఫ్యామిలీ గర్ల్స్ హై స్కూల్‌తో పోటీపడ్డారు.ఇషికా 6 పాయింట్లతో చక్కగా రాణించినా,హోలి ఫ్యామిలీ తరపున సిద్ధిక 10 పాయింట్లతో ఆకట్టుకుని 10%-%6 స్కోరుతో విజయాన్ని అందించారు.అండర్-15 బాయ్స్ టీమ్ ఫైనల్‌లో హోస్ట్ సెయింట్ పియస్ స్కూల్‌తో తలపడింది. కఠినమైన పోటీలో సెయింట్ పియస్ 15%-%10 స్కోరుతో గెలిచింది.సెయింట్ పియస్ తరపున పాల్, జాన్,మణిత్ తలా 5 పాయింట్లు సాధించగా, సెయింట్ ఆండ్రూస్ తరపున జోరవర్ మరియు కరివధన్ గౌడ్ చెరో 5 పాయింట్లు అందించారు.అండర్-15 గర్ల్స్ కూడా అద్భుత ప్రతిభ కనబరిచి,రన్నర్-అప్ స్థానం సంపాదించడం జరిగింది.సెయింట్ ఆండ్రూస్ స్కూల్ తమ విద్యార్థుల అంకితభావానికి అభినందనలు తెలిపి, తల్లిదండ్రుల మద్దతుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.ఈ విజయంతో స్కూల్ స్పోర్ట్స్ జర్నీలో మరో గొప్ప మైలురాయి చేరుకుంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి..

న్యూఢిల్లీ,జనవరి 27ప్రజావినికిడి:
బీజేపీ పాలిత రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి అమల్లోకి వచ్చింది. దీంతో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత యూసీసీ ని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ అవతరించింది. ఈ సందర్భంగా ప్రతి ఏటా జనవరి 27ని ఉత్తరాఖండ్‌లో యూసీసీ డేగా జరుపుకోనున్నట్లు సీఎం ప్రకటించారు. గతేడాది ఫిబ్రవరి 7న యూసీసీ బిల్లుకు ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఆమోదం పొందింది. 2024, మార్చి 11 ఆ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఓకే చెప్పిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మార్చి 12న నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి పౌర స్మృతి 2024 చట్టాన్ని ఈ ఏడాది జనవరిలో పూర్తిగా అమలు చేయనున్నట్లు అందులో పేర్కొన్నారు. దీని అమలు కోసం ప్రత్యేక పోర్టల్, మొబైల్ యాప్ ఏర్పాటు చేశారు. మహిళలు, పిల్లల సాధికారతే లక్ష్యంగా యూసీసీ అమలు ఉంటుందని సీఎం ధామి గతంలో తెలిపారు. కాగా, పోర్చుగీస్ పాలనలో ఉన్నప్పటి నుంచి గోవాలో ఉమ్మడి పౌరస్మృతి అమల్లో ఉంది.

........................

# త్రివేణి సంగమంలో స్నానం చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా



ప్రయాగ్‌రాజ్‌జనవరి 27ప్రజావినికిడి: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక మేళాగా ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న 'మహాకుంభ్'లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సోమవారం పాల్గొన్నారు. గంగా, యుమనా, సరస్వతీ నదులు సంగమించే త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించారు. దీనికి ముందు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్న అమిత్‌షాకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రాష్ట్ర మంత్రులు సాదర స్వాగతం పలికారు.అమిత్‌షా షెడ్యూల్ ప్రకారం, బడే హనుమాన్ జీ ఆలయాన్ని సందర్శిస్తారు. జునా అఖారాను సందర్శించి అఖారా మహరాజ్, ఇతర అఖారా సాధువులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తారు. గురు శరణానంద్ జీ అశ్రమాన్ని సందర్శించి గురు శరణానంద్, గోవింద్ గిరి జీ మహరాజ్‌ను కలుసుకుంటారు. అనంతరం శృంగేరి, పూరి, ద్వాకరా శంకరాచార్యులను కలుసుకోవడంతో ఆయన పర్యటన ముగుస్తుంది. సాయంత్రం ప్రయాగ్‌రాజ్ నుంచి బయలుదేరి తిరిగి ఢిల్లీకి చేరుకుంటారు. మహాకుంభ కీలక రోజులు కావడంతో మహాకుంభ్ ఏరియాలో 'నో వెహికల్ జోన్' ప్రకటించారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ వెహికల్ పాస్‌లు చెల్లవని మహాకుంభ్ మీడియా సెంటర్ ప్రకటించింది. సమీపంలోని పార్కింగ్ ప్రాంతాల్లో మాత్రమే వాహన యజమానులు పార్కింగ్ చేసుకోవాలని సూచించింది. మహాకుంభ్ భద్రతా ఏర్పాట్ల కోసం 10,000కు పైగా స్థానిక పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరించారు. జనవరి 29న మౌని అమావాస్య (రెండవ సాహి స్నాన్), ఫిబ్రవరి 3 వసంత పంచమి (మూడవ సాహి స్నాన్), ఫిబ్రవరి 12న మాఘ పౌర్ణమి, ఫిబ్రవరి 26న మహా శివరాత్రి భక్తులు విశేషంగా హాజరుకానున్నారు. 45 రోజుల పాటు జరిగే మహాకుంభ్ మేళాకు 45 కోట్ల మంది భక్తులు హాజరవుతారని యూపీ ప్రభుత్వం అంచనా వేసింది.

# జాతీయ ప్రధాన కార్యదర్శిగా తప్పకుంటా

**పార్టీలో కొత్తవారికి ఎక్కువ అవకాశాలు ఇస్తాం**
**దావోస్‌లో పెట్టుబుడుల కోసం కృషి చేశాం**
**రెడ్‌బుక్ ప్రకారం చర్యలు తప్పవన్న లోకేశ్**



విశాఖపట్టణంజనవరి 27ప్రజావినికిడి:
ఇకపై పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి పదవి తీసుకోనని, పార్టీకోసం పనిచేస్తానని మంత్రి లోకేశ్ అన్నారు. తనతో పాటు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా పదవి తీసుకోరని అన్నారు. పార్టీలో కొత్తవారికి అవకాశం కల్పించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. సాక్షిపై పరువు నష్టం కేసులో విశాఖ కోర్టుకు ఆయన హాజరయ్యారు. కేసు విచారణ ఫిబ్రవరి 28కి వాయిదా పడింది. కోర్టుకు హాజరైన అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడారు.2019లో సాక్షి పత్రిక తనపై అసత్య ఆరోపణలు చేసిందని మంత్రి నారా లోకేశ్తెలిపారు. అప్పుడే వారికి లీగల్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. గత ఐదు సంవత్సరాలుగా న్యాయ పోరాటం చేస్తున్నాను.. ఇది నాలుగో వాయిదా. నిజం నా వైపు ఉంది.. ఎన్ని సార్లయినా వస్తాను. ఆలస్యమైనా నిజం గెలుస్తుంది. ఈరోజు కూడా మంత్రి హోదాలో నేను వచ్చినప్పుడు పార్టీ ఆఫీసులో బస్సులో పడుకొని సొంత భోజనం తిన్నాను. ప్రభుత్వం నుంచి ఒక్క వాటర్ బాటిల్ కూడా తీసుకోలేదు. వచ్చిన వాహనం కూడా నాదే. సొంత డబ్బుతో డీజిల్ కొట్టించుకున్నా. ఎక్కడా ప్రభుత్వంపై ఆధారపడకూడదని నా తల్లి భువనేశ్వరి చిన్నప్పటి నుంచి నేర్పించారు. సీఎం చంద్రబాబు నాకు ఏ బాధ్యత ఇచ్చినా అహర్నిశలు కష్టపడతా. నావల్ల పార్టీకి ఏనాడూ చెడ్డపేరు రాకుండా చూసుకుంటా. 'యువగళం' పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు చర్యలు తీసుకుంటాం.
తల్లి, చెల్లినే నమ్మని జగన్.. ఎవరినీ నమ్మరు. డబ్బు కోసం ఆయన పార్టీనే అమ్మేసే రకం. ఇవన్నీ చూసే ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. మా పార్టీని, కార్యకర్తలను విజయసాయిరెడ్డి ఇబ్బంది పెట్టారు. అలాంటి వ్యక్తి తెదేపాలోకి వస్తానంటే ఎందుకు తీసుకుంటాం?విశాఖలో విజయసాయి చేసిన అక్రమాలపై విచారణ జరుగుతోంది. రెడ్‌బుక్ గురించి నేను చెప్పిన విషయం చాలా స్పష్టం. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయి' అని లోకేశ్ అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ టీమ్ దావోస్ పర్యటనపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్న వేళ.. మంత్రి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు.. ఏడు నెలలలో ఆరు లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తీసుకొచ్చామని స్పష్టం చేశారు.. ఇక, 2019లో బ్లూ మీడియా నాపై అసత్య కథనం ప్రచురించింది. తప్పుడు కథనంపై సమాధానం చెప్పాలని అప్పుడే నేను లీగల్ నోటీసు జారీ చేశాను అన్నారు.. మరోవైపు.. తన పాదయాత్రకు రెండేళ్లు అయిన సందర్భంగా.. రాజకీయాలలో పాదయాత్ర ఎంబీఏ లాంటిది అని పేర్కొన్నారు.. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటు వస్తున్నాము. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు పై విచారణ జరుగుతుంది. విశాఖలో జరిగిన అక్రమాలపై కూడా విచారణ సాగుతోంది.. అన్ని వ్యవహారాలపై విచారణ ఒకేసారి జరిగితే ఉన్న పోలీసులు సరిపోరు. క్రమంగా అన్నింటిపై విచారణ జరుగుతుందన్నారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1997 నుంచి దావోస్ కి వెళ్తున్నారని గుర్తుచేసిన ఆయన.. గత ప్రభుత్వంలో ఒప్పందాలు జరిగితే ఎందుకు పరిశ్రమలు స్థాపించలేకపోయారని నిలదీశారు.. మహారాష్ట్రకు ఎక్కువ పెట్టుబడుల రావడానికి కారణం ఒకే ప్రభుత్వం కొనసాగడంగా పేర్కొన్న ఆయన.. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పెట్టుబడులు పెట్టిన సంస్థల ప్రతినిధులను గతంలో జగన్మోహన్ రెడ్డి కలవలేదని దుయ్యబట్టారు.. గుజరాత్ లో 5వ సారి బీజేపీ ప్రభుత్వం రావడం వలన అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు..మన రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు అభివృద్ధిని పరుగులు పెట్టించాం.. రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి గెలవాల్సి ఉందన్నారు. చంద్రబాబు పై మాకు నమ్మకం ఉంది.. కానీ, రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గెలవలేరు అని హామీ ఇవ్వగలరా? అని దావోస్ ప్రతినిధులు అడుగుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు.. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలి. పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి తీసుకురావడానికి చాలా కష్టపడుతున్నాం అన్నారు.. మరోవైపు.. రోజాపై సెటైర్లు వేసిన లోకేష్.. అసలు రోజా కు దావోస్ కు జ్యూరిచ్ కు తేడా తెలియదు అని ఎద్దేవా చేశారు.. రెడ్ బుక్ కోసం ఎందుకు వైసీపీ నాయకులు భయపడుతున్నారని ప్రశ్నించారు.. ఇక, విశాఖలో 90 రోజులలో టీసీఎస్ ను ఏర్పాటు చేస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు..

# ఢిల్లీలో వేడెక్కిన రాజకీయాలు

## రెండు మేనిఫెస్టోను విడుదల చేసిన ఆమ్‌ఆద్మీ పార్టీ



ముంబైజనవరి 27ప్రజావినికిడి:ఢిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. అసెంబ్లీ ఎన్నికలకు మరో తొమ్మిది రోజులే సమయం ఉండటంతో అధికార, విపక్ష పార్టీల నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇక అధికార ఆమ్ ఆద్మీ పార్టీ రెండో మేనిఫెస్టోను విడుదల చేసింది. ఇప్పటికే మధ్యతరగతి ప్రజల కోసం ఆప్ మేనిఫెస్టో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా 15 గ్యారెంటీలతో ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సోమవారం కొత్త మేనిఫెస్టో రిలీజ్ చేశారు. వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో సంక్షేమ పథకాలు, ఉపాధి కల్పన, ప్రజాసేవల్లో మెరుగుదల వంటి 15 కీలక వాగ్దానాలు చేశారు. ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలను కొనసాగిస్తామని వెల్లడించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే విద్యార్థులకు ఉచిత బస్? సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. మెట్రో ఛార్జీల్లో 50శాతం రాయితీ ఇస్తామని హామీ ఇచ్చారు. 15 పోల్ గ్యారెంటీలు ఇవే..ఉపాధి హామీ.. ప్రతి మహిళకు రూ.2,100.. నేరుగా బ్యాంకు ఖాతాకే నగదు జమ. సంజీవని యోజన పథకం కింద 60 ఏళ్లు పైబడిన వారికి ఉచిత చికిత్స (ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య చికిత్స), 24 గంటల నీటి సరఫరా, యూరప్ తరహాలో రోడ్లు, యమునా నదిని శుభ్రం చేస్తాం, డాక్టర్ అంబేద్కర్ స్కాలర్‌షిప్ పథకం, విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం, ఢిల్లీ మెట్రోలో 50 శాతం రాయితీఅర్చకులు, గ్రంథులకు ఒక్కొక్కరికి రూ.18వేలు, కౌలుదారులకు ఉచిత విద్యుత్, నీరు మురుగునీటి వ్యవస్థలను మెరుగుపరచటం,రేషన్ కార్డుల మంజూరు, ఆటో, టాక్సీ, ఇ-రిక్షా డ్రైవర్లకు జీవిత బీమా, వారి కుమార్తె వివాహానికి రూ. 1 లక్ష సాయం, పిల్లలకు ఉచిత కోచింగ్, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్‌కు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పథకాలు ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మధ్యతరగతి ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి అరవింద్ కేజ్రీవాల్ ఏడు డిమాండ్లు లేవనెత్తారు. 'విద్యా బడ్జెట్‌ను రెండు నుంచి పది శాతానికి పెంచాలి, ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి. మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా ఉన్నత విద్యకు సబ్సిడీలు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి. ఆరోగ్య బడ్జెట్‌ను పది శాతానికి పెంచాలి, ఆరోగ్య బీమాపై పన్ను తొలగించాలి. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ. 7 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచాలి. నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తొలగించాలి. సీనియర్ సిటిజన్లకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టాలి. రైళ్లలో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు 50 శాతం రాయితీ ఇవ్వాలి' అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ బడ్జెట్‌ను మధ్యతరగతి ప్రజలకు అంకితం చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# మావోయిస్టుల నిర్మూలనలో కేంద్రం పైచేయి

**పూర్తిగా తుడిచిపెట్టే లక్ష్యంతా పనిచేస్తున్న బలగాలు**
**ప్రజల్లో ఆదరణ కోల్పోవడంతో మావోలకు తప్పని తిప్పలు**



న్యూఢిల్లీ,జనవరి 27ప్రజావినికిడి:
దేశంలో అశాంతికి కారణమని చెబుతున్న మావోయిస్టుల అంశాన్ని పరిష్కరించడం అంటే వాళ్ళను నిర్మూలించడమేనని ప్రధాని మోడీ, అమిత్ షా చాలా కాలంగా భావిస్తున్నారు. అందుకే నక్సల్స్ నిర్మూలనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. అడువులను జల్లెడ పట్టిస్తున్నారు. అర్బన్ నక్సలైట్లుగా గుర్తించిన వారిని సైతం అంతమొందిస్తున్నారు. కేసులతో వేధిస్తున్నారు. నక్సల్స్‌కు ప్రజాదరణ లేకుండా చేయడం, వారిని మట్టుపెట్టడం అన్న లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోంది. సమస్యఎంతటి తీవ్రమైనదైనా, దాన్ని సరిగా అర్థం చేసుకోకపోతే అది మరింత జటిలం
కావచ్చు. సాయుధ దళాలు అడవుల్లోకి బాగా లోపలికి చొచ్చుకుపోగలుగుతున్నవి. ప్రభుత్వ సాయుధ బలగాలకు నక్సలైట్లకు మధ్య దూరం నానాటికీ తగ్గిపోతోంది. మావోయిస్టుల ప్రధాన స్థావరాలకు సమీపంలో బలగాలు చేరిపోతున్నాయి. అందుకు ప్రజల మద్దతు కూడా దక్కుతోంది. కారణమేమంటే ఇన్‌ఫార్మర్ల పేరుతో మావోయస్టులు అమాయక గిరిజనలను అంతమొందిస్తున్నారు. ఇది వారికి మింగుడు పడడం లేదు. ఇంతకాలం దుర్భేద్యమనుకున్న ప్రాంతాలన్నీ సైనిక బలగాలు స్వాధీనపరచుకుంటున్నాయి. అమిత్ షా అన్నట్లుగా మావోస్ట్ పార్టీ కావచ్చు..వారి ఉద్యమం కావచ్చు...'అంతిమ ఘడియల్లో' ఉన్నట్టు చెప్పుకోక తప్పదు. బీహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఆదివాసులు, పేదప్రజలు, దళితులే మావోయిస్టులకు సానుభూతిపరులుగా ఉన్నారు. చాలా సందర్భాలలో ఆయా సానుభూతిపరులు సైతం ఎన్‌కౌంటర్లలో బలవుతున్నారు. మావోయిస్టుల ఏరివేత పేరిట భద్రతా దళాల అణచివేత చర్యలపై పౌర సమాజంలో పెద్దగా ఆందోళన వ్యక్తం కావడం లేదు. నిజానికి ప్రజల సమస్యలను ఎత్తుకున్న సమయంలో పీపుల్స వార్‌కు ప్రజల అండదండలు లభించాయి. రిక్రూట్‌మెంట్ దక్కింది. వారి పోరాటలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలు అండగా నిలిచారు. కాలక్రమంలో వారు దూరం కావడంతో మావోయిస్టుల ఉనికి కూడా కోల్పోతూ వస్తున్నారు. అందుకే దండకారణ్యంలో రక్తపుటేరులు పారుతున్నాయి. కాల్పుల మోతలతో బస్తర్ అడవులు మార్మోగుతున్నాయి. అబూజ్ మఢ్ కేంద్రంగా రెండు దశాబ్దాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మావోయిస్టులను భద్రతా బలగాలు వరుస ఎన్‌కౌంటర్లలో చావుదెబ్బ తీస్తున్నాయి. గత ఏడాదిగా జరుగుతున్న ఎదురుకాల్పుల ఘటనల్లో ఇప్పటివరకు మూడు వందలకు పైగా మావోయిస్టులు హతమైనట్లు పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. ఈ ఏడాది ఆరంభంనుంచీ గత ఇరవై రోజుల్లోనే మూడు ఎన్‌కౌంటర్లలో 44 మందికి పైగా మావోయిస్టులు అసువులు బాశారంటే పోలీసులు ఎంతలా పైచేయి సాధించారో అర్థం చేసుకోవచ్చు. దండకారణ్యాన్ని చుట్టుముట్టి కాల్పులకు పాల్పడుతున్న సాయుధ బలగాలకు వెరచి గత ఏడాది కాలంలో సుమారు 850 మంది మావోయిస్టులు లొంగిపోగా, పోలీసులు మరో 400 మందికి పైగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, సిఆర్‌పిఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా 'ఆపరేషన్ కగార్' పేరిట సాగిస్తున్న ముప్పేట దాడికి సాంకేతిక పరిజ్ఞానమూ తన వంతు సహకారం అందిస్తూండటంతో మావోయిస్టులు మూల్యం చెల్లించుకోక తప్పడం లేదు. కాకులు దూరని కారడవిలో 650కి పైగా బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని, భద్రతా బలగాలు గాలింపు జరుపుతున్నాయి. మావోయిస్టుల జాడ తెలియగానే విరుచుకుపడి మట్టుబెడుతున్నాయి. అబూజ్ మఢ్ అడవుల్లో మావోయిస్టుల జాడ పసిగట్టడంలో జిల్లా రిజర్వ్ గ్రూపు (డిఆర్‌జి)లదే కీలకపాత్ర. ముల్లును ముల్లుతోనే వెలికి తీయాలన్న ఉద్దేశంతో.. లొంగిపోయిన నక్సలైట్లను ఉపయోగించుకుని, మావోయిస్టుల జాడ కనిపెట్టేందుకు ఏర్పాటు చేసిందే ఈ డిఆర్‌జి. దట్టమైన అడవిలో ఏది ఎక్కడుందో డిఆర్‌జిలకు కొట్టినపిండి కావడంతో గాలింపు చర్యలలో వారినే ముందుభాగంలో ఉంచుతున్నారు. ఇప్పటివరకూ జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో డిఆర్‌జిల సహకారం వల్లనే పోలీసులు పైచేయి సాధించారంటే అతిశయోక్తి కాదు. ఒకప్పుడు నక్సలిజం అనేక రాష్ట్రాల్లో ఊడలూనుకుని, ప్రభుత్వాలను గడగడలాడించిన మాట వాస్తవం. నక్సలైట్లు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ, పోలీసులపైన, ఇన్ఫార్మర్లపైన మెరుపుదాడులు జరిపి మట్టుబెడుతూ పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. నక్సలైట్ల తుపాకులకు ఎందరో ప్రజాప్రతినిధులు బలైన సంఘటనలు కోకొల్లలు. ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సైతం సాయుధ పోరాట దాడులతో విలవిల్లాడింది. కారణాలేమైతేనేం, ఉభయ తెలుగురాష్ట్రాల్లో నక్సలైట్ల జోరు తగ్గి, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్ వంటి రాష్ట్రాలకు విస్తరించింది. అడపాదడపా భద్రతాదళాలపై గెరిల్లా దాడులు చేస్తూ, మావోయిస్టులు ఉనికిని చాటుకుంటున్నారు. కేంద్రంలో మూడో దఫా అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం మావోయిస్టులను తుడిచిపెట్టేందుకు కంకణం కట్టుకున్నట్లు ఛత్తీస్‌గఢ్ అడవుల్లో చోటు చేసుకుంటున్న వరుస ఎన్‌కౌంటర్లను బట్టి తెలుస్తోంది. వచ్చే ఏడాది మార్చి నెలలోగా మావోయిస్టులనుంచి ఛత్తీస్‌గఢ్‌కు విముక్తి కల్పిస్తామంటూ కేంద్ర హోం మంత్రి చేస్తున్న ప్రకటనలను కూడా ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవాలి. తెలంగాణతో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో కమ్యూనిస్టులు గతంలో సాయుధ పోరాటం చేశారు. వారు ప్రజల్లో ఉంటూ పోరాడారు. కాలక్రమంలో రాజకీయం మారింది. కమ్యూనిస్టులు కూడా మెల్లగా అంతమవుతున్నారు. సరళీకరణ ఆర్థిక విధానాల కారణంగా ప్రజలు బతుకుదెరువు కోసం దేశాన్ని దాటేస్తున్నారు.

# అక్రమ వసలదారులపై ఉక్కుపాదం

**ట్రంప్ రాకతో వెదికి పట్టుకుంటున్న అధికారులు - తొలుత వ్యతిరేకించినా.. మోకరిల్లిన కొలంబియా**



వాషింగ్టన్,జనవరి 27ప్రజావినికిడి:
అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తూ..ప్రత్యేక విమానాల్లో వారిని స్వదేశాలకు పంపించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. అమెరికా సార్వభౌమత్వాన్ని పరిరక్షించడానికి అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. యూఎస్‌లో చట్టవిరుద్ధంగా ఆశ్రయం పొందుతున్న తమ పౌరులను వెనక్కి పిలుపించుకోవడానికి ప్రపంచ దేశాలు తగిన చర్యలు తీసుకొని మాకు సహకరించాలి' అని వైట్‌హౌస్ పేర్కొంది. అయితే ఈ చర్యలను ముందుగా వ్యతిరేకించిన కొలంబియా అనంతరం వెనక్కి తగ్గి అగ్రరాజ్యం పెట్టిన నిబంధనలకు అంగీకరించిందని వైట్‌హౌస్ పేర్కొంది. కొలంబియా వెనక్కి తగ్గి స్వదేశానికి తిరిగి వచ్చిన పౌరులను ఆహ్వానించడంతో తాము ఆ దేశంపై విధించిన సుంకాలు, పలు ఆంక్షలను నిలిపివేయనున్నట్లు అమెరికా ప్రకటించింది. 'అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులను ప్రత్యేక విమానాల్లో వారివారి స్వదేశాలకు పంపడానికి అగ్రరాజ్యం అనుసరిస్తున్న తీరుపై పలు దేశాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇలా వలసదారులను తీసుకొచ్చే విమానాలను తమ దేశంలోకి అనుమతించమని కొలంబియా తేల్చి చెప్పింది. 'కొలంబియా వలసదారులను తీసుకువచ్చే అమెరికా విమానాలను దేశంలోకి ప్రవేశించకుండా నిషేధిస్తున్నా' అని ఆ దేశాధ్యక్షుడు గుస్తావో పెట్రో (–;‹_J\ú Kö_dŸú) ఇటీవల పేర్కొన్నారు. వలసదారులను గౌరవంగా పంపించేందుకు అమెరికా నిబంధనలు రూపొందిస్తేనే వాటిని అనుమతిస్తామన్నారు. ఇప్పటికే అమెరికా సైనిక విమానాలను వెనక్కి పంపించినట్లు చెప్పారు. వలసదారులను నేరస్థులుగా చిత్రీకరించకుండా, అమెరికా పౌర విమానాల్లో పంపిస్తేనే వాటిని తమ దేశంలోకి అనుమతిస్తామని పెట్రో పేర్కొన్నారు.
దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కొలంబియా ఉత్పత్తులపై సుంకాలు 50 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. కొలంబియన్ ప్రభుత్వ అధికారుల వీసాలను వెంటనే రద్దు చేస్తానని అన్నారు. ఈ చర్యలు ఆరంభం మాత్రమే అని.. తమ నిబంధనలను పాటించి ప్రపంచ దేశాలు తమ పౌరులను తిరిగి వెనక్కి ఆహ్వానించకపోతే వారిపై మరిన్ని సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. మరోవైపు అమెరికా అనుసరిస్తున్న విధానంపై బ్రెజిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలా వలసదారుల చేతులకు సంకెళ్లు వేసి పంపించడాన్ని తీవ్రంగా పరిగణించింది.



## పెళ్లి తరువాత కూడా గ్లామర్‌తో శోభిత

అక్కినేని నాగచైతన్య సమంత డివోర్స్ తర్వాత, శోభితా దూళిపాళ్ల తెరపైకి వచ్చింది. వీరి విడాకుల అనంతరం ఈ బ్యూటీ పేరు సోషల్ మీడియాలో ఎప్పుడూ వైరల్ అవుతూనే వచ్చింది. చైతూ, శోభితా ప్రేమలో ఉన్నారంటూ అనేక వార్తలు వచ్చాయి.ఇక వీటన్నింటి మధ్య ఆ వార్తలనే నిజం చేస్తూ నాగచైతన్య, శోభితను రెండో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే అక్కినేని కోడలిగా మారిన తర్వాత శోభిత అందం విషయంలో చాలా కేర్ తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. అంతే కాకుండా తన గ్లామర్ ఫొటోలతో నెట్టింట్లో తెగ రచ్చ చేస్తోంది.దీంతో ఏంటీ శోభితా సమంతను బీట్ చేయాలని చూస్తుందా ఏంటీ... నాగచైతన్యకు భార్య అయిన తర్వాత గ్లామర్ తో అందాల ట్రీట్ ఇస్తుంది అంటున్నారు కొందరు.మరికొందరేమో, సమంత గ్లామర్ ఫొటోలు షేర్ చేస్తే తప్పు పట్టారు, మరి ఇప్పుడు శోభితా చేసేది కరెక్ట్‌నే అక్కినేని కోడలు అయిన తర్వాత హద్దులు దాటి మరి గ్లామర్ అరాచకం సృష్టిస్తుంది. ఇదేంటి అంటూ

## అందంతో కట్టిపడేస్తున్న ఈషారెబ్బ



నెట్టింట్లో ఎప్పుడూ తన గ్లామర్ ఫొటోలతో రచ్చ చేసే ముద్దుగుమ్మల్లో ముందు వరసలో ఉంటుంది బ్యూటీ ఈషా రెబ్బ. ఈ బ్యూటీ అంతక ముందు తర్వాత అనే సినిమాతో తెలుగ చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టింది. అయితే ఈ బ్యూటీకి అవకాశాలు మాత్రం తక్కువే అని చెప్పాలి. అందం, అభినయం ఎంత ఉన్నా, అవకాశాల్లో మాత్రం చివరి ప్లేస్‌లో ఉంటుంది. ఈ అందాల తార. ఎప్పుడూ మంచి అవకాశాల కోసం పోరాటం చేస్తూనే ఉంటుంది. ఇక ఈ బ్యూటీ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన గ్లామర్‌తో కుర్రకారుకు పిచ్చెక్కిస్తుంటుంది. తాజాగా ఈముద్దుగుమ్మ ఇన్ స్టాగ్రామ్‌లో చీరకట్టులో ఉన్న ఫొటోలను షేర్ చేసింది. ఇందులో ఈషా స్లీవ్ లెస్ జాకెట్ ధరించి, చీరలో చాలా అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెటిజన్స్‌ను తెగ ఆకట్టుకుంటున్నాయి.

## హరిహరవీరమల్లులో బాబీ డియోల్ ఫస్ట్‌లుక్ రిలీజ్




నటుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ హరిహర వీరమల్లు. పిరియడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా రెండు పార్ట్‌లుగా రాబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఫస్ట్ పార్ట్ శరవేగంగా షూటింగ్ కంప్లీట్ చేసుకుంటుంది. మరోవైపు ఈ సినిమాను 2025 మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఇక విడుదల తేదీ దగ్గర పడడంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు మేకర్స్. ఇప్పటికే మూవీ నుంచి పవన్ కళ్యాణ్ పాడిన ఫస్ట్ సింగిల్ 'మాట వినాలి' అనే పాటను వదిలిన చిత్రబృందం తాజాగా విలన్ అప్‌డేట్ ఇచ్చింది. ఈ సినిమాలో విలన్ పాత్రలో నటిస్తున్న బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ బర్త్‌డే నేడు. ఈ సందర్భంగా మూవీ నుంచి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. బాబీ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. జ్యోతి కృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్రం మొదటి పార్ట్ 'హరిహర వీరమల్లు పార్ట్: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల రాబోతున్నది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

## ట్రైలర్ రిలీజ్‌కు తండేల్ రెడీ

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య - సాయిపల్లవి కాంబోలో వస్తోన్న రొమాంటిక్ డ్రామా ప్రాజెక్ట్ తండేల్. చందూ మొండేటి డైరెక్ట్ చేస్తోన్న ఈ మూవీ ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ప్రమోషన్స్‌లో భాగంగా ఒక్కొక్క పాటలను విడుదల చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నారు. ఇక మూవీ లవర్స్, అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తండేల్ ట్రైలర్ అప్‌డేట్ అందించారు మేకర్స్. తండేల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను వైజాగ్ శ్రీరామ పిక్చర్ ప్యాలెస్ (రామ టాకీస్ రోడ్) వద్ద నిర్వహించనున్నారు. జనవరి 28 సాయంత్రం 5 గంటల నుంచి ఈవెంట్ ఉండబోతుందని తెలియజేశారు మేకర్స్. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న తండేల్ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే



## ఓటీటీలోకి రాబోతున్న సంక్రాంతికి వస్తున్నాం!

వెంకటేష్ కథానాయకుడిగా రూపొందిన నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్ 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ సంక్రాంతికి విడుదలై వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి నాయికలుగా నటించిన ఈ సినిమాను 'దిల్' రాజు, శిరీష్ నిర్మించారు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ఈ 13 రోజుల్లో రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి వెంకటేష్ సినీ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. అయితే విడుదలైనప్పటి నుంచి ఈ సినిమా కోసం ప్రేక్షకులు థియేటర్లకు క్యూ కట్టారు. ఇప్పటికీ ఇంకా ఈ చిత్రం హౌస్‌ఫుల్ వసూళ్లు సాధిస్తోంది . అయితే తాజాగా ఈ చిత్రం ఓటీటీలో స్ట్రీమింగ్ కాబోతుందనే వార్త అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. థియేటర్స్‌లో విజయవంతంగా నడుస్తున్న సమయంలోనే ఓటీటీకి రావడం పట్ల మేకర్స్ కూడా కాస్త ఆందోళన చెందుతున్నారు. ఈ సినిమా ఓటీటీ హక్కులను జీ 5 సొంతం చేసుకుంది. అయితే ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం జీ 5 ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాన్ని ఫిబ్రవరి ప్రథమార్థంలో స్ట్రీమింగ్ చేయాల్సి వస్తుంది. అయితే ఇంకా థియేటర్‌కు జనాలు వస్తుండటంతో ఓటీటీ విడుదల తేదీలో మార్పు చేయమని దర్శక, నిర్మాతలు ఓటీటీ సంస్థను అభ్యర్థిస్తున్నారట . ప్రస్తుతం దీనికి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. అయితే జీ 5 మాత్రం అందుకు సిద్ధంగా లేదని తెలిసింది. ముందుగా అనుకున్న ఒప్పందం ప్రకారమే స్ట్రీమింగ్ చేస్తామని చెప్పడంతో నిర్మాత 'దిల్'రాజు, ఎలాగైనా ఓటీటీ స్ట్రీమింగ్ తేదీని మార్చాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నాడట.



## వారి ప్రవర్తన బాగాలేదు : మంచులక్ష్మి



టాలీవుడ్ ప్రముఖ నటి మంచు లక్ష్మి ఇండిగో విమానాయాన సంస్థ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇండిగో సిబ్బంది చాలా దురుసుగా ప్రవర్తించారని మండిపడింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా వరుసగా పోస్టులు పెట్టిందామె. అంతేకాదు తన పోస్టులకు ఇండిగో సంస్థను కూడా ట్యాగ్ చేసింది.' నా లగేజ్ బ్యాగేజ్‌ను పక్కకు తోసేశారు. కనీసం నేను నా బ్యాగ్ ఓపెన్ చేసేందుకు కూడా పర్మిషన్ ఇవ్వలేదు. వాళ్లు చెప్పింది వినకపోతే నా బ్యాగును గోవాలోనే వదిలేస్తామన్నారు. ఇది చాలా దారుణం. ఇండిగో సిబ్బంది చాలా దురుసుగా ప్రవర్తించారు. ఇంకా పచ్చి నిజం మాట్లాడుకోవాలంటేవేధించారు. చివరకు నా లగేజీకి సెక్యూరిటీ ట్యాగ్ కూడా వేయలేదు. ఒకవేళ అందులో ఏదైనా వస్తువు మిస్ అయితే సంస్థ బాధ్యత తీసుకుంటుందా? ఇంత నిర్లక్ష్యంగా ఎయిర్‌లైన్స్‌ను ఎలా నడపగలుగుతున్నారు? అని వరుస ట్వీట్స్ చేసింది మంచు లక్ష్మి. అంతేకాదు తన బ్యాగుకు కనీసం లాక్ వేయలేదు, ట్యాగ్ కూడా వేయలేదని వీడియోలు సైతం అందులో షేర్ చేసింది. ప్రస్తుతం మంచు లక్ష్మి షేర్ చేసిన పోస్టులు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరలవుతున్నాయి. మరి వీటిపై ఇండిగో విమానయాన సంస్థ ఎలా స్పందిస్తుందో చూడాలి.







## 'కన్నప్ప' నుంచి క్రేజీ అప్‌డేట్...

## ఫిబ్రవరి 3న ప్రభాస్ ఫస్ట్ లుక్

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్టుగా భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రం 'కన్నప్ప'. మైథలాజికల్ బ్యాక్ డ్రాప్ లో సిద్ధమవుతున్న ఈ చిత్రానికి ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్టులో పలువురు టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ స్టార్లు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా, ఈ మూవీలో రెబెల్ స్టార్ ప్రభాస్ కూడా ఓ కీలక పాత్రలో కనిపించనున్నారనే విషయం తెలిసిందే. దీంతో సినిమాలో డార్లింగ్ లుక్ ఎలా ఉండబోతుందా అని ఆయన అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వారి ఎదురుచూపులకు తెర దించుతూ తాజాగా మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. కన్నప్ప నుంచి ప్రభాస్ ఫస్ట్ లుక్ ను ఫిబ్రవరి 3న విడుదల చేయనున్నట్లు ఓ పోస్టర్ ద్వారా ప్రకటించారు. ఇందులో ప్రభాస్ కళ్లు, నుదుటి భాగం మాత్రమే కనిపిస్తోంది. నుదుటిపై విభూతి నామాలు, చేతిలో త్రిశూలంతో డార్లింగ్ పవర్ ఫుల్ గా కనిపించారు. అయితే, ప్రభాస్ పూర్తి లుక్ పోస్టర్ ఆ రోజు (ఫిబ్రవరి 3) విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇక, ఇటీవలే కన్నప్ప నుంచి అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ పోస్టర్లు విడుదల చేయగా మంచి స్పందన వచ్చింది. అక్షయ్, కాజల్ శివపార్వతుల పాత్రలో కనిపించనున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని అవా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై మోహన్ బాబు నిర్మిస్తున్నారు. 'కన్నప్ప' ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad ,
Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613